ఇన్ఫోగ్రాఫిక్

**నదులు వేల ఏండ్లుగా మనిషికి తాగునీరు, సాగునీరు అందిస్తున్నాయి. అయితే, నాగరికత ఆధునికతను సంతరించుకుంటున్న కొద్దీ నదీమతల్లులు కలుషితమైపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచంలో ఐదు స్వచ్ఛమైన, ఐదు కలుషితమైన నదుల గురించి తెలుసుకుందాం. నదులను పూజించే భారతదేశంలోనే నదులు ఎక్కువగా కాలుష్యం బారినపడుతున్నాయి. వాటి పరిరక్షణ బాధ్యత మనదే.**



# నదులు నిర్మలం మలినం

## స్వచ్ఛమైన నదులు

### థేమ్స్, లండన్
థేమ్స్ నది లండన్ నగర గుండెకాయ. 346 కిలోమీటర్ల పొడవైన ఈ నది లండన్‌కు మూడింట రెండువంతుల తాగునీటిని సమకూరుస్తుంది. ప్రపంచంలో స్వచ్ఛమైన, అందమైన నదిగా థేమ్స్‌ను పరిగణిస్తారు.

### టారా, మాంటెనీగ్రో
దీన్ని 'జువెల్ ఆఫ్ యూరప్' అని పిలుచుకుంటారు. యునెస్కో వారసత్వ ప్రదేశమైన ఈ నదిలో నీళ్లు స్వచ్ఛంగా ఉంటాయి.

### టార్న్, స్వీడన్-ఫిన్‌లాండ్
టార్న్ నది ఐరోపా దేశాలు స్వీడన్– ఫిన్‌లాండ్ సరిహద్దుగా ప్రవహిస్తుంది. ఈ నది పరీవాహక ప్రాంతంలో స్థానికులు పరిరక్షణ చర్యలు చేపట్టారు. కాబట్టి, నీళ్లు స్వచ్ఛంగా ఉంటాయి.

### సెయింట్ క్రోయిక్స్, అమెరికా
ఇది ఒకప్పుడు బాగా కలుషితమైన నది. తర్వాత కాలంలో తగిన జాగ్రత్త చర్యలతో పరిశుభ్రం చేసుకున్నారు. దీంతో ఇప్పుడు నదిలో నీళ్లు స్వచ్ఛంగా ఉంటున్నాయి. ఎన్నో జీవ జాతులు మనుగడ సాగిస్తున్నాయి.

### డ్వాకి, భారత్
మనదేశంలో పరిశుభ్రంగా ఉండే నదులు ఉంటాయంటే నమ్మలేం. కానీ డ్వాకి దీనికి మినహాయింపు. మేఘాలయలో ఉండే ఈ నదిలో నీళ్లు చాలా పరిశుభ్రంగా ఉంటాయి. నదీ గర్భం కూడా స్పష్టంగా కనిపిస్తుంది.



## కలుషితమైన నదులు

### గంగ, భారత్
మనం అతి పవిత్రంగా పూజించే గంగా నది ప్రపంచంలోనే అతి కలుషితమైన నదుల్లో ఒకటి అంటే కడుపు తరుక్కుపోతుంది. రోజుకు కొన్ని లక్షల గ్యాలన్ల మురికి నీళ్లు, పారిశ్రామిక వ్యర్థాలు గంగమ్మ ఒడిని చేరుకుంటున్నాయి. నదీ జలాలను పనికిరాకుండా చేస్తున్నాయి.

### సిటారం, ఇండోనేసియా
సమీపంలో ఉండే వస్త్ర పరిశ్రమల నుంచి విడుదలైన చెత్తాచెదారంతో సిటారం పరిసరాలు వికృతంగా కనిపిస్తాయి. దాదాపు మూడు కోట్ల మందికి నీటిని ఇచ్చే ఈ నది విష రసాయనాలు, మురికినీళ్లతో కలుషితమైపోయింది.

### పాసిగ్, ఫిలిప్పీన్స్
ఈ నది ఫిలిప్పీన్స్ రాజధాని నగరం మనీలా గుండా సాగిపోతుంది. ఇటీవలి కాలంలో ఈ నది కూడా విపరీతంగా కలుషితమైపోయింది. శుద్ధి చర్యలు చేపట్టారు.

### బుఢీగంగ, బంగ్లాదేశ్
ఢాకా నగర నీటి వ్యవస్థకు బుఢీగంగ కీలకం. ఇది కూడా ప్రపంచంలోనే అతి కలుషితమైన నదుల్లో ఒకటి. పారిశ్రామిక వ్యర్థాలు... ముఖ్యంగా తోలు పరిశ్రమల కారణంగా బుఢీగంగ జలాలు విషపూరితమయ్యాయి.

### యమున, భారత్
గంగా నది ఉపనదుల్లో యమున ముఖ్యమైనది. దేశ రాజధాని ఢిల్లీ, చారిత్రక నగరం ఆగ్రా గుండా ప్రవహిస్తుంది. మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు యమునా నదిని వాడకానికి పనికిరాకుండా చేస్తున్నాయి.

